క్లుప్తంగా

టీటీడీ చైర్మన్ భూమనను కలిసిన జేసీ



భూమనకు మొక్క అందజేస్తున్న జేసీ

తిరుపతి మంగళం : టీటీడీ చైర్మన్, తిరుపతి ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డిని శుక్రవారం తిరుపతి జిల్లా జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయనకు మొక్క అందజేసి కృతజ్ఞతలు తెలిపారు.

తిరుపతి గంగమ్మకు విశేష పూజలు



భాకరాపేట : చిన్నగొట్టిగల్లు చెరువు కట్టపై వెలసిన తిరుపతి గంగమ్మకు శుక్ర వారం విశేష పూజలు నిర్వహించారు. అమ్మవారికి వేకువ జామునే అభిషేకం, అర్చనలు చేశారు. విశేషంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. మహిళలు బోనాలు సమర్పించారు. ఆలయ ధర్మకర్తలు భక్తులకు రాగిజావ పంపిణీ చేశారు.


గ్రామీణులకు మెరుగైన వైద్యమే లక్ష్యం



కంటి అద్దాలు అందజేస్తున్న సర్పంచ్ భారతి

చంద్రగిరి: గ్రామీణులకు మెరుగైన వైద్యం అందించి సంపూర్ణ ఆరోగ్యవంతులుగా చేయడమే ప్రభుత్వ లక్ష్యమని ముంగళిపట్టు సర్పంచ్ భారతి తెలిపారు. ముంగళిపట్టు పంచాయతీ ఎం.కొంగరవారిపల్లి సచివాలయ పరిధిలో శుక్రవారం జగన్న ఆరోగ్య సురక్ష రెండో విడత వైద్య శిబిరం నిర్వహించారు. ప్రజలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి వైద్య పరీక్షలు చేయించుకున్నారు. ఆమె మాట్లాడుతూ గతంలో జబ్బు చేస్తే వైద్యశాలకు వెళ్లేవారమని, ఇప్పుడు సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి గ్రామంలోనే వైద్య సేవలు అందేలా హెల్త్ క్లినిక్‌లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మొదటి విడతలో ప్రజల నుంచి విశేష స్పందన రావడంతో ప్రభుత్వం రెండో విడతలో వైద్య శిబిరాలు నిర్వహిస్తోందన్నారు. అనంతరం ఆమె కంటి అద్దాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైద్యాధికారులు హేమంత్ కుమార్, ప్రసాద్ రెడ్డి, సుజిత, శివాజి ప్రయాగ్ తదితరులు పాల్గొన్నారు.


25న భారత రాజ్యాంగం - నైతికతపై సదస్సు



సదస్సు పోస్టర్లను ఆవిష్కరిస్తున్న పౌర చైతన్య వేదిక ప్రతినిధులు

తిరుపతి కల్చరల్: పౌరులకు రాజ్యాంగం కల్పించిన హక్కులపై చైతన్యం కలిగించడమే లక్ష్యంగా ఈ నెల 25వ తేదీన ఎస్వీయూలోని సెనేట్ హాల్‌లో భారత రాజ్యాంగం - నైతికతపై సదస్సు నిర్వహిస్తున్నట్లు పౌర చైతన్య వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి కె.కుమార్ రెడ్డి తెలిపారు. ఆయన శుక్రవారం ప్రెస్‌క్లబ్‌లో సదస్సు పోస్టర్లను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ ప్రజలకు హక్కులతో పాటు బాధ్యతలను వివరించి వారిని చైతన్య పరచడమే తమ వేదిక లక్ష్యమన్నారు. పిల్లలను పెంచడంలో తల్లిదండ్రుల బాధ్యతలను గుర్తు చేస్తామన్నారు. సీనియర్ పాత్రికేయుడు రాఘవ శర్మ, పరమేశ్వరరావు, ముషీర్‌అహ్మద్, రుద్రరాజు, నాగరాజు, ఉమామహేశ్వర్‌రెడ్డి, బాబు పాల్గొన్నారు.

వాకర్స్‌కు అయోధ్య అక్షింతలు



శ్రీరామ పూజిత అక్షింతలు అందజేస్తున్న నిర్వాహకులు

తిరుపతి కల్చరల్: కరకంబాడి రోడ్డులోని వినాయక నగర్‌కు చెందిన వాకర్స్‌కు శుక్రవారం అయోధ్య అక్షింతలను నిర్వాహకులు అందజేశారు. కార్యక్రమంలో వాకర్స్ ఇంటర్నేషనల్ మాజీ గవర్నర్ ఆర్కాట్ కృష్ణప్రసాద్, పొనగంటి భాస్కర్, వినాయనగర్ వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు దశరథరెడ్డి, కార్యదర్శి బాలాజీ నాయుడు, కోశాధికారి శివారెడ్డి పాల్గొన్నారు.

రేపు మట్టి అద్దం పుస్తకావిష్కరణ

తిరుపతి కల్చరల్: రచయిత యువశ్రీ మురళి రచించిన కవితా సంపుటి మట్టి అద్దం పుస్తకాన్ని ఆదివారం సాయంత్రం 4 గంటలకు యూత్ హాస్టల్లో ఆవిష్కరించనున్నట్లు అరసం జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ నెమిలేటి కిట్టన్న తెలిపారు. కవులు, రచయితలు, సాహితీ అభిమానులు పాల్గొనాలని కోరారు.

అభివృద్ధి పథంలో జీవకోన

జీవకోనలోని వార్డులు	:	05
ప్రధాన రహదారి	:	ఒకటి
జనాభా	:	46,861 మంది
ఓటర్లు	:	13,150
నాగుగేళ్ల క్రితం వరకు అభివృద్ధి చెందిన రోడ్లు, యుడీసీ, కాలువలు	:	15 శాతం
ప్రస్తుతం	:	80 శాతం

- 17 ఏళ్ల తర్వాత పూర్తి స్థాయిలో వసతులు
- రహదారులకు మోక్షం
- బాగుపడిన ఇంటర్నల్ రోడ్లు
- జీవకోన, సత్యనారాయణపురానికి ప్రత్యామ్నాయ రోడ్డు
- ప్రకాశం పార్కు - సత్యనారాయపురం కూడలి వరకు మాస్టర్ ప్లాన్ రోడ్డు



కొత్త రూపును సంతరించుకున్న జీవకోన ప్రధాన రహదారి

జీవకోనకు చేసిన ఖర్చు

2019-20లో సీసీ రోడ్లకు	:	రూ.10.10 లక్షలు
2020-21లో సీసీ రోడ్లకు	:	రూ.6.64 కోట్లు
అర్బన్ హెల్త్ సెంటర్‌కు	:	రూ.80 లక్షలు
2021-22 సీసీ రోడ్లు, వాటర్ పైపులైన్‌కు	:	రూ.1.74 కోట్లు
వాటర్ పైప్ లైన్ ఏర్పాటుకు	:	రూ.9 లక్షలు
యుడీసీకి	:	రూ.31 లక్షలు
యూపీహెచ్ ఆధునికీకరణకు	:	రూ.19 లక్షలు
2022-23లో రోడ్లు, సీసీ డ్రైన్లకు	:	రూ.5.37 కోట్లు
అర్బన్ హెల్త్ సెంటర్ భవనానికి	:	రూ.38 లక్షలు
2023-24లో సీసీ అండ్ బీటీ రోడ్లు, సీసీ డ్రైన్‌కు	:	రూ.6.58 కోట్లు
పెద్ద కాలువల్లో చెత్త తొలగింపునకు	:	రూ.9 లక్షలు
వాటర్ పైపులైన్‌కు	:	రూ.24.10 లక్షలు

తిరుపతి తుడా : తిరుపతి నగరంలో జీవకోన, సత్యనారాయణపురం ప్రాంతాలకు ప్రత్యేక స్థానం ఉంది. జీవకోనలో సుమారు 46 వేల మందికి పైగా జనాభా ఉన్నారు. 13 వేల మందికి పైగా ఓటర్లు ఉన్నారు. గత పాలకులు శీతకన్ను వేయడంతో ఏళ్ల తరబడి అభివృద్ధికి నోచుకోలేదు. కనీస వసతులు లేక స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. రాజీవ్‌నగర్ పంచాయతీగా ఉన్న జీవకోన ప్రాంతాన్ని అప్పటి దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి 2007లో తిరుపతి కార్పొరేషన్‌లో విలీనం చేశారు. ఆయన మరణంతో జీవకోన వాసుల ఆశలు అడియాశలయ్యాయి. ఇక్కడ ఎక్కువగా వసలదారులే జీవనం సాగిస్తుండడంతో వారి గురించి పట్టించుకునే నాథుడు లేకుండాపోయాడు.

ప్రస్తుతం అభివృద్ధిలో పరుగులు

వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చాక డిప్యూటీ మేయర్ భూమన అభినయ్‌రెడ్డి జీవకోన, సత్యనారాయణ ప్రాంతాల్లో అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. ఇందుకోసం ఎమ్మెల్యే భూమన సహకారంతో కౌన్సిల్ ప్రత్యేక నిధులు కేటాయించేలా చర్యలు తీసుకున్నారు. రోడ్లు, యుడీసీ, మురుగు కాలువల నిర్మాణంతోపాటు తాగునీరు, విద్యుత్ సౌకర్యాల కల్పనకు నడుం బిగించారు.

ప్రత్యామ్నాయ మార్గం ఏర్పాటు

అత్యధిక జానాభా కలిగిన జీవకోన ప్రాంతానికి సరైన రోడ్లు లేవు. ఇరుకు రోడ్లతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. ఈ క్రమంలో డిప్యూటీ మేయర్ భూమన అభినయ్ రెడ్డి ఈ ప్రాంతంపై ప్రత్యేక దృష్టి సారించారు. ఐదు వార్డుల్లో దాదాపు 80 శాతం మేర సీసీ, బీటీ రోడ్లు, సీసీ డ్రైన్లు, వాటర్ సప్లయి, నూతన భవనాల నిర్మాణాలు చేపట్టారు. జీవకోనకు వెళ్లేందుకు ప్రధాన రహదారి ఒకటి మాత్రమే ఉండగా నేడు ప్రకాశం పార్కు కూడలి నుంచి సత్యనారాయణపురం కూడలి వరకు 40 అడుగుల మాస్టర్ ప్లాన్ రోడ్డు ఏర్పాటుచేస్తున్నారు. అలాగే జీవకోన ప్రభుత్వ పాఠశాల నుంచి జీవలింగేశ్వర ఆలయం వరకు రోడ్డు విస్తరణను చేపట్టారు. ఉపాధ్యాయ నగర్ మాస్టర్ ప్లాన్ రోడ్డు నుంచి జీవకోన, సత్యనారాయణపురం ప్రాంతాలను కలుపుతూ అనేక రోడ్లను అభివృద్ధి చేశారు.



ఆరోగ్య కేంద్రం



నాడు: జీవకోనలోని రోడ్డు



నేడు : జీవకోన రోడ్డు

ఊహించని స్థాయిలో అభివృద్ధి



జీవకోన, సత్యనారాయణపురంలో ఏళ్లతరబడి కనీస వసతులు లేక ఇబ్బంది పడ్డాం. ఇప్పుడు సీసీ, బీటీ రోడ్లను అభివృద్ధి చేశారు. తాగునీటి సౌకర్యాన్ని మెరుగుపరిచారు. ప్రకాశం పార్కు కూడలి నుంచి సత్యనారాయణపురం కూడలి వరకు 40 అడుగుల రోడ్డు వేశారు. నాలుగన్నరేళ్లలో ఊహించని అభివృద్ధిని చూస్తున్నాం.

\- సురేష్, సత్యనారాయణపురం

అభినయ్‌రెడ్డి ముందుచూపుతోనే..



డిప్యూటీ మేయర్ భూమన అభినయ్‌రెడ్డి ముందుచూపుతోనే తిరుపతిలో పెద్ద ఎత్తున అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. చూస్తుండగానే తిరుపతి దిన దినాభివృద్ధి చెందుతోంది. నాలుగేళ్లలోనే నగర రూపురేఖలే మారిపోయాయి. జీవకోన, సత్యనారాయణపురం ప్రాంతాలకు కొత్త వైభవం వచ్చింది.

\- నారాయణ, చిరువ్యాపారి

మేము సైతం..

తిరుపతి రూరల్: విజయవాడలో ఏర్పాటుచేసిన దేశంలోనే అతిపెద్ద అంబేడ్కర్ విగ్రహావిష్కరణలో భాగస్వామ్యులయ్యేందుకు చంద్రగిరి ప్రజలు సిద్ధమయ్యారు. పెద్ద సంఖ్యలో శుక్రవారం ఉదయం విజయవాడకు తరలివెళ్లారు. తుడా చైర్మన్, వైఎస్సార్ సీపీ చంద్రగిరి నియోజకవర్గ ఇన్‌చార్జ్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి తన సొంత నిధులతో పదుల సంఖ్యలో వాహనాలను ఏర్పాటు చేశారు. తిరుపతి రూరల్ మండలం అవిలాల వద్ద వాహనాలను మోహిత్‌రెడ్డి జెండా ఊపి ప్రారంభించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో చరిత్రలో లిఖించేలా రూపుదిద్దుకున్న ప్రపంచ మేధావి విగ్రహావిష్కరణకు నియోజకవర్గం నుంచి పార్టీలు, కులాలు, మతాలకు అతీతంగా వందలాది మంది తరలివెళ్లారు. వైస్ ఎంపీపీ విడుదల మాధవరెడ్డి, నాయకులు పాల్గొన్నారు.



జెండా ఊపి వాహనాలను ప్రారంభిస్తున్న తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి

జగనన్న ప్రభుత్వానికి జనం జేజేలు

చంద్రగిరి: అర్హతే ప్రామాణికంగా పథకాలు అందజేస్తున్న జగనన్న ప్రభుత్వానికి ప్రజలు జేజేలు పలుకుతున్నారని చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డి తెలిపారు. ఆయన శుక్రవారం ఎంపీపీ హేమేంద్ర కుమార్‌రెడ్డి, ఎంపీటీసీ బుల్లెట్ చంద్రమౌళి రెడ్డితో కలిసి కోట, తురకపల్లి, కావమ్మగుడి వీధి, బజారు వీధిలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ప్రతి గడపకూ వెళ్లి వారు ప్రభుత్వం నుంచి పొందిన లబ్ధిని వివరించారు. వారి సమస్యలను తెలుసుకున్నారు. వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. చేసిన మేలును గుర్తించి వచ్చే ఎన్నికల్లో తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్ రెడ్డిని ఆదరించి గెలిపించాలని కోరారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ఏ నియోజకవర్గంలోనూ లేని విధంగా చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి పలు అభివృద్ధి పనులు చేశారని వివరించారు. తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి అనతి కాలంలోనే ఏళ్ల తరబడి అపరిష్కృతంగా ఉన్న సమస్యలను పరిష్కరించి అభివృద్ధి పనులను పరుగులు పెట్టిస్తున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో జెట్పీటీసీ చిల్లకూరి యుగంధర్‌రెడ్డి, ఎంపీటీసీ మాధవరెడ్డి, జిల్లా వాణిజ్య విభాగం అధ్యక్షుడు చేగు ప్రశాంత్ గుప్త, ఏఎంసీ వైస్ చైర్మన్ చేగు గోవర్ధన్ గుప్త, నాయకులు మస్తాన్, గుంటూరు రాజేశ్వరి, మట్టా మధుసూదన్ రెడ్డి, ముదికుప్పం రామ్మూర్తి, పార్లపల్లి చంద్రశేఖర్ రెడ్డి, బండారు హేమచంద్ర, కొత్తపాటి హరి, రామిశెట్టి శశిధర్, రహంతుల్లా, సుదర్శన్, రేఖ, శివ, హరినాథ్ పాల్గొన్నారు.



చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డికి స్వాగతం పలుకుతున్న రామిశెట్టి శశిధర్ తదితరులు

సుబ్రమణ్యం కుటుంబానికి పరామర్శ

నాయీబ్రాహ్మణ కాలనీకి చెందిన రిటైర్డ్ టీటీడీ ఉద్యోగి ఏనుగుల సుబ్రమణ్యం ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. ఈ విషయం తెలుసుకున్న హర్షిత్‌రెడ్డి శుక్రవారం సుబ్రమణ్యం నివాసానికి వెళ్లి ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు.

ఫిబ్రవరి 17, 18 తేదీల్లో రోబో ట్రాక్ పోటీలు

తిరుపతి(అలిపిరి): తిరుపతి ప్రాంతీయ విజ్ఞాన కేంద్రం, ఇండియన్ సైన్స్ కాంగ్రెస్ అసోసియేషన్ చాప్టర్ సహ భాగస్వామ్యంతో ఇంజినీరింగ్, పాలిటెక్నిక్ విద్యార్థులకు వచ్చేనెల 17, 18వ తేదీల్లో రోబోట్రాక్- 2024 పోటీలు నిర్వహించనున్నట్లు ప్రొఫెసర్ ఆర్.రామమూర్తి, ఇండియన్ సైన్స్ కాంగ్రెస్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు, ఎస్వీయూ మాజీ వీసీ సుదీప్తా సాహా తెలిపారు. ఆయన శుక్రవారం స్థానిక సైన్స్ సెంటర్‌లో పోస్టర్లను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ మొదటి రోజు పోటీల్లో బృందం లైన్- ఫాలోయింగ్ రోబోట్ రూపొందించి స్వయంప్రతిపత్తితో పని చేసే విధానంపై ప్రోగ్రామింగ్ చేయాలని తెలిపారు. రెండో రోజు బృందం రూపొందించిన రోబోట్‌ను ట్రాక్‌ను అనుసరించి కనిష్ఠ సమయ వ్యవధిలో గమ్యాన్ని చేరుకోవాలన్నారు. ఈ పోటీలో విజేతలకు నగదు మొదటి బహుమతిగా రూ.5,000, రెండో బహుమతిగా రూ.3,000, తృతీయ బహుమతిగా రూ.2,000 అందజేయనున్నట్లు పేర్కొన్నారు. పోటీల్లో పాల్గొనే వారందరికీ సర్టిఫికెట్లు అందజేస్తామని వెల్లడించారు. వివరాలకు 0877 - 2286202, 7989694681నంబర్లలో సంప్రదించాలని కోరారు.



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న అధికారులు

అన్ని సౌకర్యాలతో టీటీడీ ఉద్యోగుల క్రీడాపోటీలు

తిరుపతి(అలిపిరి): టీటీడీ ఉద్యోగులకు నిర్వహించే వార్షిక క్రీడా పోటీలకు అన్ని సౌకర్యాలు కల్పించాలని టీటీడీ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు చీర్ల కిరణ్ కోరారు. ఆయన శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ ఈ ఏడాది ఉద్యోగుల వార్షిక క్రీడలను పరేడ్ గ్రౌండ్‌లో కాకుండా ఎస్వీ హైస్కూల్ ప్లే గ్రౌండ్‌లో నిర్వహించాలన్నారు. అక్కడ సరైన క్రీడా సామగ్రి ఏర్పాటు చేయాలన్నారు. అనువుగా కోర్టులు, మైదానాన్ని సిద్ధం చేయాలని తెలిపారు. క్రీడల్లో గెలుపొందిన వారికి మొదటి బహుమతిని రూ.2 వేల నుంచి రూ.2,500లకు, రెండవ బహుమతిని రూ.1800 నుంచి రూ.2200 వరకు, మూడో బహుమతిని రూ.1600 నుంచి రూ.2000 వరకు పెంచాలని విజ్ఞప్తి చేశారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులకు టీ -షర్టు, క్యాప్‌లు ఇచ్చిన విధంగా టీటీడీ ఉద్యోగుల వార్షిక క్రీడల్లో పాల్గొనే వారికీ ఇవ్వాలని కోరారు.



మాట్లాడుతున్న చీర్ల కిరణ్

కుల గణన ప్రారంభం

భాకరాపేట : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కుల గణన మండలంలో శుక్రవారం ప్రారంభమైంది. సచివాలయ సిబ్బంది, వలంటీర్లు చిన్నగొట్టిగలు, ఎర్రావారిపాళెం మండలాల్లోని గ్రామాలకు చేరుకున్నారు. రెండు మండలాల్లోని 25 గ్రామ పంచాయతీల్లో కుల గణనను పకడ్బందీగా చేస్తున్నట్టు చిన్నగొట్టిగల్లు, ఎర్రావారిపాళెం ఎంపీడీవోలు దేవేంద్రబాబు, అమర్‌నాథ్ తెలిపారు.

సమ సమాజ న్యాయం కోసమే నవ సోషలిజం

తిరుపతి కల్చరల్: సమాజంలో నూతన ఒరవడిని తీసుకురావడానికి, ప్రతి ఒక్కరికీ సమ న్యాయం కలిపించాలనే లక్ష్యంతో నవ సోషలిజం పార్టీని ఏర్పాటుచేసినట్టు ఆ పార్టీ జాతీయ అధ్యక్షుడు పి.ఆనంద తెలిపారు. ఆయన శుక్రవారం ప్రెస్‌క్లబ్‌లో నవ సోషలిజం పార్టీ లోగోను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ కులమతాలు, రాజకీయాలకు అతీతంగా తమ పార్టీ పనిచేస్తుందన్నారు. మహాత్మాగాంధీ, సుభాష్‌చంద్ర బోస్, అంబేద్కర్, జ్యోతిరావ్ పూలే వంటి మహనీయుల ఆశయాల సాధన కోసం కృషి చేస్తామని చెప్పారు. పార్టీ ప్రతినిధులు సూరిబాబురెడ్డి, రఘుబాబు, ప్రభాకర్ పాల్గొన్నారు.

బలరామిరెడ్డి సేవలు చిరస్మరణీయం

తిరుపతి సిటీ : సిండికేట్ మెంబర్‌గా, సెనేట్ సభ్యుడిగా ఎస్వీయూకు ఎం.బలరామిరెడ్డి చేసిన సేవలు చిరస్మరణీయమని వీసీ శ్రీకాంత్‌రెడ్డి కొనియాడారు. ఎస్వీయూ ఆర్ట్స్ బ్లాక్‌లో శుక్రవారం బలరామిరెడ్డి ధర్మనిధి ఉపన్యాస కార్యక్రమంలో వీసీ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ ఎస్వీయూ అభివృద్ధిలో బలరామిరెడ్డి కృషి వెలకట్టలేనిదన్నారు. ఎస్వీయూ మాజీ వీసీ పి.జయరామిరెడ్డి బలరామిరెడ్డి మెమోరియల్ సొసైటీని స్థాపించడం గర్వించదగ్గ విషయమన్నారు. ఆయన 14వ వర్ధంతిని జయరామిరెడ్డి ఆధ్వర్యంలో జరుపుకోవడం సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో రమేష్, ఆచార్యులు పేట శ్రీనివాసులు రెడ్డి, జయచంద్రారెడ్డి, పద్మనాభం, రామక్రిష్టారెడ్డి, రాజేశ్వరమ్మ, పెంచల ప్రసాద్ పాల్గొన్నారు.



ఉపన్యాస కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న వీసీ తదితరులు

జగనన్న పాల వెల్లువతో రైతులకు పెద్ద పీట

భాకరాపేట : జగనన్న పాల వెల్లువతో మహిళా పాడి రైతులకు పెద్ద పీట వేస్తున్నట్టు తిప్పిరెడ్డిగారిపల్లె సర్పంచ్ మాధవి తెలిపారు. పంచాయతీ పరిధిలోని కొత్తపల్లె, తిప్పిరెడ్డిగారిపల్లె, యడమవారిపల్లె గ్రామాల్లో శుక్రవారం జగనన్న పాల వెల్లువపై అవగాహన కల్పించారు. జగనన్న పాల వెల్లువ కార్యక్రమం ఇన్‌చార్జి రవిబాబు మాట్లాడుతూ ప్రతి కుటుంబమూ ఆర్థికంగా ముందుకు నడవాలనే జగనన్న పాల వెల్లువ కార్యక్రమాన్ని ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకుందన్నారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి మోహన్‌రెడ్డి, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, రైతు మహిళలు పాల్గొన్నారు.

మారుతి ఆస్పత్రిలో అరుదైన ఆపరేషన్

తిరుపతి కల్చరల్: తిరుపతి బస్టాండ్ సమీపంలోని శ్రీమారుతి ఆస్పత్రి వైద్యులు అరుదైన శస్త్ర చికిత్సను విజయవంతంగా పూర్తి చేశారు. ప్రముఖ కార్డియాలజిస్ట్ డాక్టర్ పి.చంద్రశేఖర్‌రెడ్డి పర్యవేక్షణలో రోగికి అరుదైన డబుల్ చాంబర్ మేస్ మేకర్‌ను డబుల్ చాంబర్ పేస్‌మేకర్‌ను అమర్చి ప్రాణాలు కాపాడారు. ఆస్పత్రి మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ ఎం.మారుతి కృష్ణ మాట్లాడుతూ ఇలాంటి అత్యాధునిక, అరుదైన ఆపరేషన్ల కోసం చెన్నై, హైదరాబాద్ మహానగరాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా అతి తక్కువ ఖర్చుతో తమ ఆస్పత్రిలో వైద్యం అందిస్తున్నట్లు తెలిపారు. అలాగే క్యాత్ ల్యాబ్, 2డి ఎకో, టీఎంటీ, కార్డియాక్ ఐసీయూ తదితర సౌకర్యాలు ఉన్నాయని చెప్పారు. గుండెతో పాటు అడ్వాన్సుడు పల్మనాలజీ, 24/7 నిపుణులైన వైద్యులతో మూడు అత్యధిక పరికరాలతో కూడిన ఐసీయూలు, నాలుగు ఆపరేషన్ థియేటర్లు ఉన్నాయని వివరించారు.



ఆపరేషన్ చేస్తున్న వైద్యులు

నేడు ఉచిత కంటి వైద్య శిబిరం

పాకాల : స్థానిక ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో ఆదివారం చెన్నై శంకర నేత్రాలయ మిషన్ ఫర్ విజయ్ ట్రస్ట్ సహకారంతో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్టు లయన్స్ క్లబ్ అధ్యక్షుడు మారసాని విజయ్‌బాబు తెలిపారు. శిబిరానికి వచ్చే వారు తప్పనిసరిగా ఆధార్ కార్డు తీసుకురావాలన్నారు. అవసరమైన వారిని చెన్నై తీసుకెళ్లి ఉచితంగా శస్త్ర చికిత్సలు చేయిస్తామన్నారు. వివరాలకు 8143337722 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

శ్రీవారి సేవలో మంత్రి ఉషశ్రీ చరణ్

తిరుమల: తిరుమల శ్రీవారిని శుక్రవారం వీఐపీ విరామ సమయంలో ఏపీ మహిళా శిశు సంక్షేమ శాఖామంత్రి ఉషశ్రీ చరణ్ దర్శించుకున్నారు. అనంతరం ఆమెకు రంగనాయకుల మండపంలో వేదపండితులు వేదాశీర్వచనం అందించగా అధికారులు శ్రీవారి తీర్థప్రసాదాలు అందజేశారు. ఆలయం వెలుపల మంత్రి మీడియాతో మాట్లాడారు. వచ్చే ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల మార్పులు, చేర్పులు సీఎం జగన్ ఆదేశానుసారం జరిగినట్టు పేర్కొన్నారు. తమ బ్రాండ్ సీఎం జగన్‌నేనని వివరించారు. 175/175 టార్గెట్ రీచ్ అవ్వడం ఖాయమన్నారు. ప్రజలు సీఎం జగన్ మోహన్ రెడ్డినే సీఎం చేయాలని కోరుకుంటున్నారని తెలిపారు. ప్రజల వద్దకే సంక్షేమ ఫలాలు, అభివృద్ధి తీసుకెళ్లిన ఘనత సీఎం జగన్‌కు దక్కినట్టు తెలిపారు. సీటు రాని ఎవరిలోనూ అసమ్మతి లేదని, అందరూ జగన్ వెంటే నడుస్తున్నారని స్పష్టం చేశారు. అదేవిధంగా తెలంగాణ ఎమ్మెల్యే సంజయ్ కుమార్ తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. ఆయన గురువారం రాత్రి తిరుమలకు చేరుకుని శుక్రవారం ఉదయం వీఐపీ విరామ సమయంలో స్వామి వారి సేవలో పాల్గొన్నారు. ఆలయం వెలుపల మీడియాతో మాట్లాడుతూ గడిచిన 10 ఏళ్లలో బీఆర్ఎస్ ప్రభుత్వం సుపరిపాలన అందించిందని కొనియాడారు. అధికారుల తప్పిదాల వల్ల ప్రజల్లో అసంతృప్తి వచ్చిందన్నారు. 8 వేల మెగావాట్స్ విద్యుత్ నుంచి 18 వేల మెగా వాట్స్ విద్యుత్ వరకు తీసుకొచ్చిన ఘనత బీఆర్ఎస్ ప్రభుత్వానిదన్నారు.

అదే విధంగా కర్ణాటక హైకోర్టు చీఫ్ జస్టిస్ ప్రసన్న బి వరాలే, డీఐజీ అమ్మిరెడ్డి, గుజరాత్ రాష్ట్ర మంత్రి మోహన్‌బాయ్ బవాలియా దర్శించుకున్నారు. వారికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం కల్పించారు. అనంతరం రంగనాయకుల మండపంలో పండితులు వేద ఆశీర్వచనం అందించగా అధికారులు లడ్డూ ప్రసాదాలతో సత్కరించారు.



మంత్రి ఉషశ్రీ చరణ్